సాక్షి ఖమ్మం

11

సోమవారం । 4 । డిసెంబర్ । 2023

గరిష్ఠం / కనిష్ఠం
29° / 23°

వాతావరణం
జిల్లాలో సోమవారం కనిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం, సాయంత్రం మంచు కురిసే అవకాశముంది.


హస్తగతం

ఉమ్మడి ఖమ్మంలోని ఎనిమిది స్థానాల్లో కాంగ్రెస్ ఘనవిజయం

- కొత్తగూడెం స్థానం కైవసం చేసుకున్న సీపీఐ
- భారీ మెజార్టీలతో విజయదుందుభి
- ప్రతీచోట అన్ని రౌండ్లలో కాంగ్రెస్, సీపీఐ అభ్యర్థుల ఆధిక్యత
- భద్రాచలం స్థానంతోనే సరిపెట్టుకున్న బీఆర్ఎస్
- ఏ మాత్రం ప్రభావం చూపని సీపీఎం, బీజేపీ, జనసేన
- ఆశించిన ఫలితం దక్కక ఖంగుతిన్న కారు

ఉమ్మడి ఖమ్మం జిల్లా హస్తగతమైంది. సర్వే అంచనాలకు మించి ఆ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీ సాధించారు. గతంలోనూ కాంగ్రెస్ అభ్యర్థులకు విజయాలు దక్కినా... ఈ స్థాయిలో మెజార్టీ సాధించలేదు. కానీ ఈసారి ఆ పార్టీ అభ్యర్థులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రికార్డు స్థాయిలో మెజార్టీ పొందడంతో హస్తం హవా కొనసాగింది. పొత్తులో భాగంగా కొత్తగూడెం నుంచి పోటీ చేసిన సీపీఐ అభ్యర్థి కూడా భారీ మెజార్టీతో గెలుపొందారు. ఉమ్మడి జిల్లాలోని పాలేరు, ఖమ్మం, మధిర, వైరా, సత్తుపల్లి, ఇల్లెందు, అశ్వారావుపేట, పినపాక నియోజకవర్గాలు కాంగ్రెస్ భారీ మెజార్టీతో దక్కించుకోగా, కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు విజయం సాధించారు. కేవలం భద్రాచలం స్థానాన్ని మాత్రమే స్వల్ప మెజార్టీతో బీఆర్ఎస్ గెలుపొందింది. ఇక పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ సీపీఎం డిపాజిట్లు కోల్పోగా, జనసేన, బీజేపీ అభ్యర్థులు కనీస ప్రభావాన్ని చూపలేకపోయారు. కాంగ్రెస్ ఘనవిజయంతో ఆ పార్టీ శ్రేణులు అంతటా సంబరాలు చేసుకోగా, విజేతలు అధిష్టానం పిలుపు మేరకు హైదరాబాద్ వెళ్లారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇల్లెందు నుంచి కోరం కనకయ్యకు అత్యధిక మెజార్టీ లభించగా... ఆ తర్వాత పొంగులేటి రెండో స్థానంలో నిలిచారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం





పాయం వెంకటేశ్వర్లు | రేగా కాంతారావు

విజేతకు పోలైన ఓట్లు : 90,510
మెజారిటీ : 34,506
రెండో స్థానం : రేగా కాంతారావు (బీఆర్ఎస్) 56,004
మూడో స్థానం : పాడియం బాలరాజు (బీజేపీ)



తెల్లం వెంకట్రావు | పొదెం వీరయ్య

విజేతకు పోలైన ఓట్లు : 53,252
మెజారిటీ : 5,719
రెండో స్థానం : పొదెం వీరయ్య (కాంగ్రెస్) - 47,533
మూడో స్థానం : కారం పుల్లయ్య (సీపీఎం)



కోరం కనకయ్య | బానోత్ హరిప్రియ

విజేతకు పోలైన ఓట్లు : 1,09,171
మెజారిటీ : 57,309
రెండో స్థానం : బానోతు హరిప్రియ (బీఆర్ఎస్) : 51,862
మూడో స్థానం : రవీందర్ నాయక్ (బీజేపీ)



జారె ఆదినారాయణ | మెచ్చా నాగేశ్వరరావు

విజేతకు పోలైన ఓట్లు : 74,993
మెజారిటీ : 28,905
రెండో స్థానం : మెచ్చా నాగేశ్వరరావు (బీఆర్ఎస్) - 46,088
మూడో స్థానం : పిట్టల అర్జున్ (సీపీఎం)



కూనంనేని సాంబశివరావు | జలగం వెంకట్రావు

విజేతకు పోలైన ఓట్లు : 80,336
మెజారిటీ : 26,547
రెండో స్థానం : జలగం వెంకటరావు (ఫార్వర్డ్ బ్లాక్) - 53,789
మూడో స్థానం : వనమా వెంకటేశ్వరరావు (బీఆర్ఎస్)



పొంగులేటి శ్రీనివాసరెడ్డి | కందాళ ఉపేందర్‌రెడ్డి

విజేతకు పోలైన ఓట్లు : 1,27,820
మెజారిటీ : 56,650
రెండో స్థానం : కందాళ ఉపేందర్‌రెడ్డి (బీఆర్ఎస్) ఓట్లు : 71,170
మూడో స్థానం : తమ్మినేని వీరభద్రం (సీపీఎం)



తుమ్మల నాగేశ్వరరావు | పువ్వాడ అజయ్‌కుమార్

విజేతకు పోలైన ఓట్లు : 1,36,016
మెజారిటీ : 49,381
రెండో స్థానం : పువ్వాడ అజయ్‌కుమార్ (బీఆర్ఎస్) ఓట్లు : 86,635
మూడో స్థానం : ఎం.రామకృష్ణ (జనసేన)



మల్లు భట్టివిక్రమార్క | లింగాల కమల్‌రాజ్

విజేతకు పోలైన ఓట్లు : 1,08,970
మెజారిటీ : 35,452
రెండో స్థానం : లింగాల కమల్‌రాజ్ (బీఆర్ఎస్) ఓట్లు : 73,518
మూడో స్థానం : పాలడుగు భాస్కర్ (సీపీఎం)



మాలోతు రాందాస్ నాయక్ | బానోతు మదన్‌లాల్

విజేతకు పోలైన ఓట్లు : 93,913
మెజారిటీ : 33,045
రెండో స్థానం : బానోతు మదన్‌లాల్ (బీఆర్ఎస్) ఓట్లు : 60,868
మూడో స్థానం : భూక్యా వీరభద్రం (సీపీఎం)



మట్టా రాగమయి | సండ్ర వెంకట వీరయ్య

విజేతకు పోలైన ఓట్లు : 1,11,245
మెజారిటీ : 19,440
రెండో స్థానం : సండ్ర వెంకటవీరయ్య (బీఆర్ఎస్) ఓట్లు : 91,805
మూడో స్థానం : ఎన్.రామలింగేశ్వరరావు (బీజేపీ)

రికార్డు మెజార్టీ.. పొంగులేటి

పాలేరు నియోజకవర్గంలో నోటాకు 518 ఓట్లు పడగా.. 157 ఓట్లు చెల్లలేదు. మిగిలిన 2,15,969 ఓట్లను లెక్కిస్తే... కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి పై 56,650 ఓట్ల మెజార్టీ సాధించారు. పొంగులేటికి 1,27,820 ఓట్లు రాగా.. కందాళ ఉపేందర్‌రెడ్డికి 71,170 ఓట్లు పోలయ్యాయి. సీపీఎం అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కేవలం 5,308 ఓట్లు మాత్రమే సాధించడం గమనార్హం. బీఎస్పీ అభ్యర్థి అల్లిక వెంకటేశ్వరరావు 2,096 ఓట్లు పొందారు. మెజార్టీ పరంగా ఉమ్మడి జిల్లాలో ఇల్లెందు అభ్యర్థి కనకయ్య తర్వాత పొంగులేటికి రెండో స్థానం సాధించారు.

తుమ్మలకు భారీ ఆధిక్యం

ఖమ్మంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌పై కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన తుమ్మల నాగేశ్వరరావు భారీ మెజార్టీతో గెలిచారు. తుమ్మలకు 49,381 ఓట్ల మెజార్టీ లభించింది. తుమ్మలకు 1,36,016 ఓట్లు రాగా.. బీఆర్ఎస్ అభ్యర్థికి 86,635, జనసేన అభ్యర్థి మిరియాల రామకృష్ణకు 4,040, సీపీఎం అభ్యర్థి యర్రా శ్రీకాంత్ 1,940ఓట్లు పోలయ్యాయి. మొత్తం 2,36,224 ఓట్లు పోల్ కాగా 44 ఓట్లు తిరస్కరించారు. నోటాకు 1,925 ఓట్లు పడ్డాయి. మరో రెండు టెండర్ ఓట్లు ఉన్నాయి. 2009లో స్వల్ప మెజార్టీతో ఇండిపెండెంట్ అభ్యర్థి జలగం వెంకట్రావుపై విజయం సాధించిన తుమ్మల ఈసారి ఇదే స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి అజయ్‌పై 49,381 ఓట్ల మెజార్టీ సాధించడం విశేషం.

నాలుగో సారి భట్టి..

మధిర నియోజకవర్గంలో మొత్తం 1,96,419 ఓట్లు పోలయ్యాయి. ఇందులో చెల్లని ఓట్లు 55, నోటాకు 1,453 ఓట్లు వచ్చాయి. మిగిలిన 1,94,911 ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క 1,08,970, బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్ 73,518, సీపీఎం అభ్యర్థి పాలడుగు భాస్కర్ 6,575, బీజేపీ అభ్యర్థి పెరుమాళ్లపల్లి విజయరాజ్ 2,021 ఓట్లు సాధించారు. ఈ నలుగురు మినహాయిస్తే మిగిలిన 11 మందికి మిగతా ఓట్లు వచ్చాయి. ఇక్కడ ఇరవై రౌండ్లలో లెక్కింపు జరగగా, ప్రతీ రౌండ్‌లోనూ భట్టి ఆధిక్యతను కనపరుస్తూ 35,452 ఓట్ల మెజార్టీ సాధించారు. 2009, 2014, 2018తో పాటు ఈ ఎన్నికల్లోనూ భట్టి వరుసగా కమల్‌రాజ్‌పైనే విజయం సాధించడం విశేషం.

వైరాలో రాందాస్‌కు పట్టం

వైరా నియోజకవర్గంలో 12 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇక్కడ నోటాకు 1,230 ఓట్లు పడగా.. 50 చెల్లని ఓట్లు ఉన్నాయి. ఇవి మినహాయించి 1,68,177 ఓట్లను లెక్కించారు. కాంగ్రెస్ అభ్యర్థి మాలోత్ రాందాస్ నాయక్ 93,913, బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ 60,868, సీపీఎం అభ్యర్థి భూక్యా వీరభద్రం 4,439, జనసేన అభ్యర్థి సంపత్ నాయక్ 2,712 ఓట్లు పొందారు. 18 రౌండ్లకు గాను అన్నింటా కాంగ్రెస్ ఆధిక్యత కనపరిచింది. మొత్తంగా కాంగ్రెస్ అభ్యర్థి రాందాస్‌నాయక్ 33,045 ఓట్ల మెజార్టీతో సమీప ప్రత్యర్థి మదన్‌లాల్‌పై విజయం సాధించారు. తొలిసారి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన రాందాస్‌నాయక్ గతంలో పోటీ చేసిన అభ్యర్థుల కన్నా ఎక్కువ మెజార్టీ పొందారు.

రాగమయి 'చేతి'లో సండ్ర ఓటమి

సత్తుపల్లి నుంచి 2009, 2014, 2018 ఎన్నికల్లో విజయకేతనం ఎగుర వేసిన సండ్ర వెంకటవీరయ్యకు ఈసారి పరాభవం ఎదురైంది. కాంగ్రెస్ అభ్యర్థి మట్టా రాగమయి చేతిలో ఆయన ఓటమి పాలయ్యారు. ఈ నియోజకవర్గంలో నోటాకు 635 ఓట్లు రాగా, మరో 38 ఓట్లు తిరస్కరించారు. మొత్తం 2,14,714 ఓట్లను పరిగణనలోకి తీసుకుంటే కాంగ్రెస్ అభ్యర్థి రాగమయికి 1,11,245, బీఆర్ఎస్ అభ్యర్థి సండ్రకు 91,805ఓట్లు, బీజేపీ అభ్యర్థి నంబూరి రామలింగేశ్వరరావుకు 1,882, సీపీఎం అభ్యర్థి మాచర్ల భారతికి 1,225 ఓట్లు వచ్చాయి. 19,440 ఓట్ల మెజార్టీతో రాగమయి సండ్రపై విజయం పొందారు. ఈ నియోజకవర్గం నుంచి తొలి మహిళగా ఆమె రికార్డు సాధించారు.

మూడోసారీ' ఒక్కటే...

- బీఆర్ఎస్‌ను ఆదరించని జిల్లా
- 2014, 2018 మాదిరే ఈసారి ఒక స్థానంలోనే విజయం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయపరంగా విలక్షణమైన తీర్పు ఇస్తున్నా, ఈసారి ఇచ్చిన తీర్పుతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇక 2014, 2018తో పాటు ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్కో స్థానంతోనే సరిపెట్టుకుంటోంది. తొలిసారి కొత్తగూడెం, రెండోసారి ఖమ్మం స్థానాలు దక్కించుకుగా ఈసారి భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. ఆ పార్టీ వైరాలో మినహా సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టికెట్లు ఇచ్చినా.. ఫలితం మాత్రం కనిపించలేదు. అలాగే, గులాబీ దళపతి కేసీఆర్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాలు కలిసొచ్చేలా నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలకు హాజరయ్యారు. ఈ సభల్లో కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ అభ్యర్థులపై విమర్శలు గుప్పించారు. కేటీఆర్ సైతం రోడ్ షోలు నిర్వహించి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. సభలు, రోడ్‌షోలు విజయవంతం కావడంతో గతం కన్నా మెజార్టీ స్థానాలు తమ పార్టీ దక్కించుకుంటుందని బీఆర్ఎస్ అభ్యర్థులతోపాటు ముఖ్యనేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. పోలింగ్ అయిన తర్వాత కూడా తమదే విజయమనే ధీమాతో ఉన్నారు. కానీ ఫలితాలు మాత్రం పూర్తి భిన్నంగా రావడంతో అభ్యర్థులు, శ్రేణులు కోలుకోలేని పరిస్థితికి దారితీశాయి. ఎనిమిది స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించగా, కాంగ్రెస్ మద్దతుతో కొత్తగూడెం నుంచి బరిలోకి దిగిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు సైతం మంచి మెజార్టీతో గెలుపొందారు. భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రావు స్వల్ప మెజార్టీతో గట్టెక్కారు.

సీపీఎం అభ్యర్థులకు దక్కని డిపాజిట్లు

పాలేరులో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేనికి పరాభవం



తమ్మినేని వీరభద్రం (ఫైల్)

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లాలో కొత్తగూడెం, పినపాక మినహా ఎనిమిది స్థానాల్లో సీపీఎం తమ అభ్యర్థులను బరిలోకి దింపింది. ఏ పార్టీతో పొత్తు లేకుండా పోటీ చేయగా, ఆశించిన ఫలితం మాత్రం దక్కలేదు. పాలేరులో పోటీ చేసిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సహా అభ్యర్థులందరూ డిపాజిట్లు కోల్పోయారు. అంతేకాకుండా గతంతో పోలిస్తే తక్కువ శాతం ఓట్లు నమోదయ్యాయి. పాలేరులో తమ్మినేని వీరభద్రంకు 5,308 ఓట్లు రాగా, వైరాలో భూక్యా వీరభద్రంకు 4,439, సత్తుపల్లిలో మాచర్ల భారతికి 1,225, మధిరలో పాలడుగు భాస్కర్ 6,575, ఖమ్మంలో యర్రా శ్రీకాంత్ 1,940 ఓట్లు, ఇల్లెందులో దుగ్గి కృష్ణకు 2,103 ఓట్లు, భద్రాచలంలో కారం పుల్లయ్యకు 5,860, అశ్వారావుపేటలో పిట్టల అర్జున్ 2,488 ఓట్లు సాధించారు.

తెల్దారుపల్లిలో కాంగ్రెస్‌కు మెజారిటీ!

పాలేరు సీపీఎం అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకు ఆయన స్వగ్రామమైన తెల్దారుపల్లిలో పరాభవం ఎదురైంది. గ్రామంలో మొత్తం 3,150 ఓట్లు నమోదు కాగా, ఇందులో తమ్మినేనికి 665 ఓట్లే వచ్చాయి. కాంగ్రెస్‌కు 2,030 ఓట్లు రాగా, బీఆర్ఎస్‌కు 246 ఓట్లు పోలయ్యాయి. కొన్ని దశాబ్దాలుగా తెల్దారుపల్లిలో ఏ ఎన్నిక జరిగినా పోటీ లేకుండా ఏకగ్రీవంగా సీపీఎం నేతలనే ఎన్నుకునే వారు. కానీ ఈసారి పూర్వ పరిస్థితులను తారుమారు చేస్తూ గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి 1,365 ఓట్ల మెజార్టీ రావడం విశేషం. ఇక ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది స్థానాల్లో సీపీఎం పోటీ చేయగా... వీరభద్రం కంటే మధిర, భద్రాచలం అభ్యర్థులు పాలడుగు భాస్కర్, కారం పుల్లయ్యకు ఎక్కువ ఓట్లు నమోదు కావడం మరో విశేషం.

భద్రాచలంలో సెంటిమెంట్ పునరావృతం

భద్రాచలం: భద్రాచలంలో కొన్నేళ్లుగా కొనసాగుతున్న సెంటిమెంట్ పునరావృతమైంది. ఇక్కడ ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే ఆ పార్టీ రాష్ట్రంలో అధికారం రాదనేది రివాజు. 2004లో కుంజా సత్యవతి గెలవగా అప్పుడు మాత్రమే వైఎస్సార్ అధికారం చేపట్టారు. అంతకు ముందు, ఆతర్వాత ఎన్నడూ ఇలా జరగలేదు. 2014 ఎన్నికల్లో ఇక్కడ సీపీఎం అభ్యర్థి గెలవగా, 2018లో రాష్ట్రమంతా బీఆర్ఎస్ హవా కొనసాగినా భద్రాచలంలో కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య గెలిచి ప్రతిపక్ష హోదాలో కొనసాగారు. ఈసారి రాష్ట్రమంతా కాంగ్రెస్ హవా కొనసాగితే భద్రాచలంలో మాత్రం బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావుకు ఇక్కడ ప్రజలు పట్టం కట్టడం విశేషం. జిల్లాలో బీఆర్ఎస్ గెలిచిన ఏకైక సీటు కూడా భద్రాచలమే.



స్ట్రాంగ్ రూం నుంచి కంట్రోల్ యూనిట్లతో వస్తున్న సిబ్బంది



కంట్రోల్ యూనిట్‌ను పరిశీలిస్తున్న అధికారులు



పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తున్న ఉద్యోగులు

సాఫీగా సాగిన ఓట్ల లెక్కింపు

- అసెంబ్లీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లులోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు.
- పటిష్టమైన పోలీస్ బందోబస్తు మధ్య కౌంటింగ్ నిర్వహించడమే కాక అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.
- ఉదయం 6గంటల నుంచే కౌంటింగ్ కేంద్రాల వద్ద సందడి నెలకొంది.
- రిటర్నింగ్ అధికారి జారీ చేసిన పాస్‌లు ఉన్న మీడియా ప్రతినిధులు, కౌంటింగ్ ఏజెంట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే అనుమతించారు.
- తొలుత ఖమ్మం, మధిర, సత్తుపల్లి, పాలేరు, వైరా నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్లు, సర్వీస్ ఓట్లను లెక్కించాక ఈవీఎంల లెక్కింపు ప్రారంభమైంది.
- మీడియా సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చేందుకు పెద్ద స్క్రీన్లు, టీవీలు ఏర్పాటు చేశారు.
- కౌంటింగ్ కేంద్రంలోకి కౌంటింగ్ ఏజెంట్లతో పాటు ఎవరిని కూడా సెల్‌ఫోన్లతో అనుమతించలేదు.
- ఫొటోలు, వీడియోలు తీసుకునేందుకు విడతల వారీగా కెమెరామెన్లు, మీడియా ప్రతినిధులను కొద్దిసేపు చొప్పున కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించారు.
- కౌంటింగ్ కేంద్రం ప్రాంగణంలో సీఆర్పీఎఫ్, ఆర్మ్‌డ్, జిల్లా పోలీస్ యంత్రాంగం బందోబస్తు విధులు నిర్వర్తించారు.
- కౌంటింగ్ కేంద్రం ఆవరణలో వైద్య సిబ్బంది, అంబులెన్స్‌తో పాటు ఫైరింజన్‌ను అందుబాటులో ఉంచారు.
- ఫలితాలు వెలువడుతున్న క్రమంలో ఒకరిద్దరు అభ్యర్థులు వస్తుండడం, మరికొందరు అభ్యర్థులు తమ ఫలితాలతో నిరాశకు గురై వెళ్లిపోవడం కనిపించింది.
- రౌండ్ల వారీగా ఫలితాలు వస్తుండగానే లీడ్‌లో ఉన్న వారి అనుచరులు నినాదాలు చేస్తూ టపాసులు కాల్చారు.
- కౌంటింగ్ కేంద్రం వద్ద మహిళా ఉద్యోగులు, ఏజెంట్ల కోసం సంచార శౌచాలయాలు ఏర్పాటు చేశారు.

– ఖమ్మం సహకారనగర్/ ఖమ్మం మయూరిసెంటర్/ ఖమ్మం వన్‌టౌన్



రౌండ్ల వారీగా ఓట్ల వివరాలు నమోదు చేసుకుంటున్న పోలింగ్ ఏజెంట్లు



కౌంటింగ్ కేంద్రంలో కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్



ఫలితాలు వెలువడ్డాక సమావేశమైన రాగమయి (సత్తుపల్లి), పొంగులేటి శ్రీనివాసరెడ్డి(పాలేరు), తుమ్మల నాగేశ్వరరావు(ఖమ్మం), భట్టి విక్రమార్క(మధిర), రాందాస్ నాయక్ (వైరా)

విజేతలు వీరే...

ఉమ్మడి జిల్లాలోని పది శాసనసభ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన అభ్యర్థుల వివరాలు, రాజకీయ, కుటుంబ నేపథ్యాలు ఇలా ఉన్నాయి. – సాక్షి నెట్‌వర్క్

భద్రాచలం (బీఆర్‌ఎస్)

పేరు: తెల్లం వెంకట్రావు
స్వస్థలం: దుమ్ముగూడెం మండలం సూరారం గ్రామం
తల్లిదండ్రులు: బాపనయ్య, జానకమ్మ
పుట్టిన తేది: జనవరి 25, 1967
వృత్తి: వైద్యుడు
విద్యార్హత: ఎంబీబీఎస్(సిద్దార్థ మెడికల్ కళాశాల, విజయవాడ)
ఎంఎస్(ఉస్మానియా మెడికల్ కళాశాల, హైదరాబాద్)
భార్య: ప్రవీణ,
పిల్లలు: ఇద్దరు కుమార్తెలు, విద్యను అభ్యసిస్తున్నారు


భద్రాచలం ఎమ్మెల్యేగా గెలిచిన బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావుకు గెలుపు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి మంగీలాల్

భద్రాచలం నియోజకవర్గంలో గతంలో ప్రభుత్వ వైద్యుడిగా పనిచేశారు. అనంతరం ఉద్యోగానికి రాజీనామా చేసి వైఎస్సార్ సీపీలో చేరిక ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. తొలుత 2014లో మహబూబాబాద్ ఎంపీగా వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసి ఓటమి పొందారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరి 2018లో భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పొందారు. అనంతరం పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. భద్రాచలం టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు కేటాయించటంతో నెలరోజుల్లోనే మళ్లీ బీఆర్‌ఎస్‌లో చేరారు. గులాబీ టికెట్ పొంది పొదెం వీరయ్యపై విజయం సాధించారు.

ఖమ్మం (కాంగ్రెస్)

పేరు : తుమ్మల నాగేశ్వరరావు
జననం : 15 నవంబర్ 1953
స్వస్థలం : గండుగులపల్లి, దమ్మపేట మండలం
భార్య : భ్రమరాంబ
సంతానం : కుమారుడు యుగంధర్, కుమార్తెలు మోహిని, చంద్రిక



గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న తుమ్మల నాగేశ్వరరావు

రాజకీయ నేపథ్యం : 1982లో టీడీపీలో చేరిన తుమ్మల నాగేశ్వరరావు, తొలిసారి ఎన్నికల్లో ఓటమి చెందారు. 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో గెలుపొందారు. ఆ తర్వాత 1994, 1999, 2009 ఎన్నికల్లో వరుసగా టీడీపీ నుంచి గెలిచి ఆర్‌అండ్‌బీ, భారీ నీటిపారుదల మంత్రిగా పనిచేశారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరి 2015లో శాసన మండలి సభ్యుడిగా నియమితులయ్యారు. ఆర్‌అండ్‌బీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. బీఆర్‌ఎస్ నుంచి 2016లో ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. గత సెప్టెంబర్‌లో కాంగ్రెస్‌లో చేరి, ఖమ్మం నుంచి బరిలో దిగి, విజయం సాధించారు.

పాలేరు (కాంగ్రెస్)

పేరు : పొంగులేటి శ్రీనివాసరెడ్డి
జననం : 28, అక్టోబర్ 1965
స్వస్థలం : నారాయణపురం, కల్లూరు మండలం
తల్లిదండ్రులు : రాఘవరెడ్డి – స్వరాజ్యం
విద్యాభ్యాసం : బీఏ, భార్య : మాధురి,
కుమారుడు : హర్షారెడ్డి, కుమార్తె : సప్నిరెడ్డి


పొంగులేటి శ్రీనివాసరెడ్డి తరుపున గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఆయన సోదరుడు ప్రసాదరెడ్డి

రాజకీయ నేపథ్యం: పొంగులేటి 2013లో వైఎస్సార్ కాంగ్రెస్‌లో చేరి, తెలంగాణ ఏర్పడ్డాక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. 2014లో ఖమ్మం లోక్‌సభ సభ్యుడిగా గెలుపొందారు. 2014 నుంచి 2019 వరకు రవాణా, పర్యాటక శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఉన్నారు. 2016 బీఆర్‌ఎస్‌లో చేరారు. గత జూలైలో కాంగ్రెస్‌లో చేరి, ప్రచార కమిటీ కో చైర్మన్‌గా నియమితులయ్యారు. తాజా ఎన్నికల్లో పాలేరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

మధిర (కాంగ్రెస్)

పేరు : మల్లు భట్టి విక్రమార్క
జననం : 15–06–1961
తల్లిదండ్రులు : అఖిలాండ – మణెమ్మ
స్వస్థలం : స్నానాల లక్ష్మీపురం, వైరా
విద్యార్హత : ఎంఏ, భార్య : నందిని
కుమారులు: సూర్యవిక్రమాదిత్య, సహేంద్ర విక్రమాదిత్య


గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క

రాజకీయ నేపథ్యం: మల్లు భట్టి 1994 నుంచి 2000 వరకు ఆంధ్రాబ్యాంకు డైరెక్టర్‌గా పనిచేశారు. 2007లో ఎమ్మెల్సీగా ఎన్నికై 2009 మార్చి వరకు కొనసాగారు. 2009లో మధిర ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రభుత్వ చీఫ్ విప్‌గా, అసెంబ్లీ ఉప సభాపతిగా వ్యవహరించారు. 2014లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచి సీఎల్పీ నేతగా ఎన్నికయ్యారు. 2015లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. 2018లో మూడోసారి గెలిచి, సీఎల్పీ నేతగా కొనసాగుతున్నారు. తాజా ఎన్నికల్లో నాలుగోసారి విజయం సాధించారు.

ఇల్లెందు (కాంగ్రెస్)

పేరు : కోరం కనకయ్య
భార్య పేరు : కోరం లక్ష్మి
విద్యార్హత : బీఏ
వయసు : 61 సంవత్సరాలు
వృత్తి : వ్యవసాయం
గ్రామం : కోయగూడెం, టేకులపల్లి మండలం


గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

రాజకీయ నేపథ్యం : 1986లో బేతంపూడి పీఏసీఎస్ డైరెక్టర్, 1995లో టేకులపల్లి జెడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2004లో ఉమ్మడి రాష్ట్రంలో ఎస్టీ సెల్ కన్వీనర్‌గా పనిచేశారు. 2014లో కాంగ్రెస్ నుంచి ఇల్లెందు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరారు. 2018లో బీఆర్‌ఎస్ నుంచి బరిలో దిగి ఓటమి చెందారు. ఆ తర్వాత టేకులపల్లి జెడ్పీటీసీగా గెలిచి జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. కొన్ని నెలల ముందు పొంగులేటితోపాటు కాంగ్రెస్‌లో చేరిన ఆయన మరోసారి ఇల్లెందు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

వైరా (కాంగ్రెస్)

పేరు: మాలోత్ రాందాస్ నాయక్
స్వగ్రామం: ఎదురుగడ్డ, లక్ష్మీదేవిపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం
తల్లిదండ్రులు: లక్ష్మి, హనుమా
విద్యాభ్యాసం: బీకాం
భార్య: లలిత, ఏఎన్‌ఎం
ఇద్దరు కుమార్తెలు : డాక్టర్ గాయత్రి, డాక్టర్ చందన
కుమారుడు : మాలోత్ విగ్నేష్, బీటెక్
ప్రస్తుత నివాసం : వైరా


గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

రాజకీయ అనుభవం: ఎన్‌ఎస్‌యూఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. కొత్తగూడెం సొసైటీ డైరెక్టర్‌గా పని చేశారు. 2007 నుంచి 2009 వరకు కొత్తగూడెం టీడీపీ మండలాధ్యక్షుడిగా, టీడీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. టీడీపీ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేసి అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. 2018 నుంచి పీసీసీ సభ్యుడు, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు, రాష్ట్ర ఎస్టీసెల్ ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్నారు.

సత్తుపల్లి (కాంగ్రెస్)

పేరు : డాక్టర్ మట్టా రాగమయి
భర్త : డాక్టర్ మట్టా దయానంద్
పిల్లలు : నీలోత్పల, విపంచి, విరాజి
విద్యాభ్యాసం: ఎంబీబీఎస్, డీటీసీడీ (ఛాతీవైద్యురాలు)
వయస్సు : 52 సంవత్సరాలు



గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న డాక్టర్ మట్టా రాగమయి

రాజకీయ నేపథ్యం: డాక్టర్ మట్టా దయానంద్ సతీమణిగా పరిచయం. ఆమె అత్త డాక్టర్ మట్టా ఆరోగ్యం ఎంపీపీగా పనిచేశారు. మామ మట్టా కృష్ణమూర్తి స్వాతంత్ర్య సమరయోధుడు. 2014 ఎన్నికల్లో పోటీ చేసేందుకు సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న రాగమయి ఉద్యోగాని కి రాజీనామా చేశారు. అయితే ఆ ఎన్నికల్లో వైఎ స్సార్ సీపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆమె భర్త దయానంద్ రెండువేల ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఈసారి కూడా దయానంద్ పోటీకి దిగాలని భావించినా కుల ధ్రువీకరణపై వివాదం తలెత్తడంతో రాగమయి రాజకీయంగా తెరపైకి వచ్చారు. కాగా తన కూతురు అకాల మరణంతో ఆషా పేరి ట స్వచ్ఛంద సేవా సంస్థ స్థాపించి రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.

పినపాక (కాంగ్రెస్)

పేరు: పాయం వెంకటేశ్వర్లు
వయసు: 49
తండ్రి : కామరాజు(లేటు),
తల్లి : రాములమ్మ
భార్య: ప్రమీల
సంతానం : ఇద్దరు పిల్లలు
పుట్టిన తేదీ : 06.05.1974
జన్మస్థలం : బండారుగూడెం, మణుగూరు మండలం
విద్యార్హత : బీఏ
గ్రామం: సమితిసింగారం, మణుగూరు


గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

రాజకీయ నేపథ్యం: పాయం వెంకటేశ్వర్లు 1986 నుంచి 1992 వరకు ఏఐఎస్‌ఎఫ్, 1992 నుంచి 1999 వరకు ఏఐవైఎఫ్‌లో పనిచేశారు. 1993 నుంచి సీపీఐ బండారుగూడెం గ్రామశాఖ కార్యదర్శిగా పనిచేసిన ఆయన.. అనంతరం పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. బూర్గంపాడు నియోజకవర్గంలో సీపీఐ నుంచి పోటీ చేసి 1999లో ఓటమి చెందారు. 2004లో గెలిచారు. అనంతరం వైఎస్సార్ సీపీలో చేరి 2014లో పినపాక ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో, సుమారు ఆరు నెలల క్రితం పొంగులేటితోపాటు కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా కాంగ్రెస్ నుంచి బరిలో దిగి, పినపాకలో మరోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

కొత్తగూడెం (సీపీఐ)

పేరు: కూనంనేని సాంబశివరావు
తండ్రిపేరు: వెంకటరత్నం
పుట్టిన తేది: 14.1.1956, విద్యార్హత: డిగ్రీ
భార్య: ప్రమీలాదేవి
సంతానం: కుమారుడు భరత్, కూతురు క్రాంతి
ప్రస్తుత పదవి: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి


గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కూనంనేని

రాజకీయ నేపథ్యం: తొలుత జర్నలిజం వృత్తి చేపట్టిన కూనంనేని విశాలాంధ్ర దినపత్రికలో సబ్ ఎడిటర్/రిపోర్టర్‌గా మూడేళ్లు పనిచేశారు. అనంతరం సీపీఐ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. 1987 నుంచి 1992 వరకు కొత్తగూడెం ఎంపీపీగా పనిచేశారు. 1999, 2004లో సుజాతనగర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. 2009లో కొత్తగూడెం ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో ఓటమి చెందిన ఆయన, తాజా ఎన్ని కల్లో కాంగ్రెస్ బలపర్చిన సీపీఐ అభ్యర్థిగా మరో సారి ఎమ్మెల్యేగా గెలిచారు. అనేక కార్మిక, ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించిన కూనంనేని మూడుసార్లు జైలు జీవితం గడిపారు.

అశ్వారావుపేట (కాంగ్రెస్)

పేరు: జారె ఆదినారాయణ
జన్మదినం: 08.07.1983
తండ్రి పేరు: సత్యనారాయణ
విద్య: ఎమ్మెస్సీ, బీపీఈడీ
భార్య: వరలక్ష్మి (ప్రభుత్వ టీచర్)
పిల్లలు: కుమార్తె, కుమారుడు
స్వగ్రామం: గండుగులపల్లి, దమ్మపేట


గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న జారె ఆదినారాయణ

రాజకీయ నేపథ్యం : అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వ ఉపాధ్యాయుడు(పీఈటీ)గా పని చేశారు. 2014 సంవత్సరంలో ఉద్యోగానికి రాజీనామా చేసి, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. తిరిగి 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి టికెట్ ఆశించినా దక్కలేదు. ఈ ఏడాది మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరి, 2023 ఎన్నికల్లో విజయం సాధించారు.

హోరెత్తిన సంబురాలు



కాంగ్రెస్ జెండాతో వెళ్తున్న అభిమానులు

పొన్నెకల్‌లోని శ్రీ చైతన్య కాలేజీలో అసెంబ్లీ ఓట్ల లెక్కింపు చేపట్టారు. అభ్యర్థుల వారీగా ఒక్కో రౌండ్ ఫలితం వెలువడుతుండగా కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. పరస్పరం ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అలాగే, అభ్యర్థులకు శుభాకాంక్షలు చెప్పడమే కాక బాణసంచా పేల్చారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటున్న తుమ్మల నాగేశ్వరరావు, భట్టి, పొంగులేటి


బాణసంచా పేలుస్తున్న పార్టీ శ్రేణులు


విజయం అనంతరం కుటుంబ సభ్యులతో పొంగులేటి శ్రీనివాసరెడ్డి

రాగమయి... సత్తుపల్లి తొలి మహిళా ఎమ్మెల్యే

సత్తుపల్లి/సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి తొలి మహిళ ఎమ్మెల్యేగా మట్టా రాగమయి ఘన విజయం సాధించారు.సత్తుపల్లి నియోజకవర్గం ఏర్పడిన 72ఏళ్లలో మహిళకు పట్టం కట్టడం ఇదే మొదటిసారి. ప్రభుత్వ వైద్యురాలైన ఆమె 2014లో తన భర్త డాక్టర్ మట్టా దయానంద్‌కు మద్దతుగా ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆ ఎన్నికల్లో నామినేషన్ వేసినప్పటికీ ఉపసంహరించుకుని భర్తకు మద్దతు గా ప్రచారం చేశారు. ఆతర్వాత వైద్యవృత్తికే అంకితమయ్యారు. ఈసారి మట్టా దయానంద్ ఎస్సీ సర్టిఫికెట్ కలెక్టర్ రద్దు చేయడంతో క్రియాశీలక రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. కేవలం ఆరు నెలల వ్యవధిలోనే టికెట్ సాధించడం, ప్రచారం చేసిన రాగమయి బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్యను ఓడించి సంచలన విజయం నమోదు చేశారు. ఈ ఎన్నికల్లో రాగమయికి 1,09,449 ఓట్లు కాగా, సండ్ర వెంకటవీరయ్యకు 90,974 ఓట్లు నమోదయ్యాయి. పోస్టల్ బ్యాలెట్లతో కలిపి ఆమె 19,464 ఓట్ల మెజార్టీ సాధించారు.

గండుగులపల్లి నుంచి ఇద్దరు విజేతలు!

ఒకే పార్టీ నుంచి గెలిచిన తుమ్మల, జారె

అశ్వారావుపేట: 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలుగా ఒకే పార్టీ నుంచి ఎన్నికయ్యారు. అశ్వారావుపేట ఎమ్మెల్యేగా జారె ఆదినారాయణ, ఖమ్మం ఎమ్మెల్యేగా తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ నుంచి ఆదివారం వెల్లడించిన ఫలితాల్లో ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. వీరిద్దరూ అశ్వారరావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామానికి చెందినవారు కావడం ప్రత్యేకతను సంతరించుకుంది. కాగా తుమ్మల నాగేశ్వరరావు టీడీపీ, టీఆర్‌ఎస్ కేబినెట్‌లలో మంత్రిగా పనిచేశారు. జారే ఆదినారాయణ బీఆర్‌ఎస్ నుంచి 2014లో పోటీచేసి ఓటమి పాలయ్యారు. తాజాగా కాంగ్రెస్ నుంచి గెలిచి తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టనున్నారు. సీఎం కేసీఆర్ సిట్టింగ్‌లకు సీట్ ఇవ్వడంతో పొంగులేటిని ఆశ్రయించి కాంగ్రెస్ సీటును జాక్‌పాట్‌లా దక్కించుకున్నారు. ఎమ్మెల్యే కావడం కోసం ప్రభుత్వ ఉద్యోగాన్ని త్యజించిన ఆయన పదిహేనేళ్ల కలను సాకారం చేసుకున్నారు.


కారేపల్లిలో కంపించిన భూమి

కారేపల్లి: కారేపల్లిలో ఆదివారం ఉదయం 9.07గంటలకు కొద్దిసెకన్ల పాటు భూమి కంపించింది. ఆ సమయాన ఇంట్లో పాత్రలు కదలడంతో భూకంపం వచ్చిందంటూ ప్రజలు ఆందోళన చెందారు. పలువురు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే, మాధారం డోలమైట్ మైన్స్‌లో చేపట్టిన పేలుళ్ల కారణంగా శబ్దం రావడంతో భూమి కంపించి ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఈ విషయమై అధికారులు ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి రైల్వే స్టేషన్ సమీపాన ఆదివారం ఖమ్మం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి జారిపడిన వ్యక్తి మృతి చెందాడు. కాగా, మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,454

శాసనసభకు వైద్యులు, పీఈటీ

అశ్వారావుపేట: చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించే వారిలో విద్యావంతుల వాటా పెరుగుతోంది. ఆదివారం వెల్లడైన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు వైద్యులు, ఒక క్రీడా ఉపాధ్యాయుడు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. మరో క్రీడా ఉపాధ్యాయుడు పరాజయం పాలయ్యారు. అశ్వారావుపేట ఎమ్మెల్యేగా గెలుపొందిన జారె ఆదినారాయణ(కాంగ్రెస్) గతంలో ప్రభుత్వ పాఠశాలలో క్రీడా ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉద్యోగానికి రాజీనామా చేశారు. భద్రాచలం ఎమ్మెల్యేగా గెలుపొందిన తెల్లం వెంకట్రావు(బీఆర్‌ఎస్) ఎంబీబీఎస్ వైద్యుడు కాగా భద్రాచలంలోనే ప్రాక్టీస్ చేస్తున్నారు.

సత్తుపల్లి ఎమ్మెల్యేగా గెలిచిన మట్టా రాగమయి ప్రభుత్వ వైద్యురాలిగా అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని పలు పీహెచ్‌సీలలో విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసినా వైద్యవృత్తిలో కొనసాగుతున్నారు. ఇక పినపాక నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమికి గురైన రేగా కాంతారావు గతంలో పీఈటీగా పనిచేసి వీఆర్‌ఎస్ తీసుకున్నారు.

జంప్ జిలానీల ఓటమి

గెలిచాక పార్టీ మారిన ఆరుగురు ఎమ్మెల్యేలకు చేదు అనుభవం

ఖమ్మం డెస్క్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గత ఎన్నికల్లో ఓ పార్టీ నుంచి గెలిచాక మరో పార్టీ తీర్థం పుచ్చుకున్న ఎమ్మెల్యేలకు ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పారు. జంప్ జిలానీ ఎమ్మెల్యేలందరూ ఓటమి చెందారు. పాలేరు, పినపాక, కొత్తగూడెం, ఇల్లెందు శాసనసభా స్థానాల నుంచి కందాల ఉపేందర్ రెడ్డి, రేగా కాంతారావు, వనమా వెంకటేశ్వరరావు, బానోత్ హరిప్రియ 2018లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అనంతరం అభివృద్ధి పేరుతో అధికార బీఆర్‌ఎస్ పంచన చేరారు. సత్తుపల్లి, అశ్వారావుపేట నుంచి కూటమి(టీడీపీ) అభ్యర్థులుగా సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు పోటీ చేసి విజయం సాధించారు. వీరు కూడా గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈసారి ఎన్నికల్లో వీరందరూ బీఆర్‌ఎస్ నుంచి బరిలోకి దిగి ఓటమి చెందారు. ఇక వైరా నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరిన లావుడ్యా రాములు నాయక్‌కు ఆ పార్టీ టికెట్ ఇవ్వకుండా మొండిచేయి చూపిన విషయం విదితమే.

ప్రత్యర్థి ఓట్ల కంటే కనకయ్య మెజారిటే ఎక్కువ

ఇల్లెందు: ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య ఘనవిజయం సాధించారు. తాజా ఎన్నికల్లో కనకయ్యకు 1,08,316 ఓట్లు రాగా, ప్రత్యర్థి, బీఆర్‌ఎస్ అభ్యర్థి హరిప్రియకు 51,418 ఓట్లు వచ్చాయి. కనకయ్యకు 56,898 ఓట్ల మెజారిటీ లభించింది. హరిప్రియకు లభించిన ఓట్ల కంటే కనకయ్య మెజారిటీనే ఎక్కువగా ఉండటం విశేషం. ఈయన నాలుగు దఫాలు ఎమ్మెల్యేగా పోటీ చేయగా రెండుసార్లు గెలుపొందారు. ప్రస్తుతం జెడ్పీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. తాజాగా ఎమ్మెల్యేగా గెలిచారు.

కౌంటింగ్ వైపు కన్నెత్తి చూడని కమల్‌రాజ్

మధిర: మధిర బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ కౌంటింగ్ కేంద్రం వైపు కన్నెత్తి చూడలేదు. ఓట్ల లెక్కింపు ఆదివారం ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లులోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా పోటీ చేసిన అభ్యర్థులందరూ తమ ఏజెంట్లతో లెక్కింపు కేంద్రానికి రాగా, కమల్‌రాజ్ రాలేదు. ఆయన తన నివాసంలోనే ఉండి ఎన్నికల ఫలితాలను తెలుసుకున్నారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందు కమల్‌రాజ్ ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని ఆయనే వీడియో ద్వారా పార్టీ శ్రేణులకు వివరించారు.

రేపు అండర్-19 క్రీడా జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా జూనియర్ కళాశాలల క్రీడా సంఘం ఆధ్వర్యాన ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–19 బాలబాలికల వాలీబాల్ జట్లను ఈనెల 5న ఎంపిక చేయనున్నారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఎంపిక పోటీలు జరుగుతాయని క్రీడల సంఘం కార్యదర్శి ఎం.డీ.మూసాకలీం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వయసు ధృవీకరణ పత్రాలతోపాటు ఆధార్ కార్డుతో ఉదయం 9గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు.

దాడి గర్హనీయం..

ఖమ్మం సహకారనగర్: జిల్లా కేంద్రంలోని టీఎస్జీవోస్ జిల్లా కార్యాలయం, ఫంక్షన్ హాల్‌పై జరిగిన దాడి గర్హనీయమని యూనియన్ బాధ్యులు పేర్కొన్నారు. ఇలాంటి దాడులు సరికాదని వారు ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఈ దాడి జరిగిందని, బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులను వారు కోరారు.